


నేటి దినపత్రిక
18వ వసంతంలోకి...
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
బుధవారం 26 ఫిబ్రవరి 2025 పేజీలు 8

# ప్రత్యేక బృందాలతో గట్టి నిఘా పెట్టండి

- మాదక ద్రవ్యాల మూలాలపై ఉక్కు పాదం మోపాలి
- విద్యాసంస్థల్లో క్యాంపస్ అంబాసిడర్లను గుర్తించి, శిక్షణ ఇవ్వండి
- యాంటీ నార్కోటిక్ క్లబ్‌లను క్రియాశీలం చేయాలి
- మాదక ద్రవ్య రహిత సమాజానికి సమష్టి భాగస్వామ్యం అవసరం
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ





**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి సమన్వయ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమష్టి కృషి అవసరమని.. మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన 149 హాట్‌స్పాట్‌లపై గట్టి నిఘా పెట్టాలని, ఈ విషయంలో ఈగల్ బృందాలు కీలకంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలు తదితరాలపై మంగళవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు విద్యాసంస్థల్లో క్యాంపస్ అంబాసిడర్లను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఉజ్వల జీవితాన్ని ఎలా నాశనం చేస్తాయనే విషయాలను మిగతా 2లో

## మహా శివరాత్రి పుణ్య స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బంది లేకుండా సీనియర్ అధికారుల పర్యవేక్షణ
- ఘాట్లలో జల్లు స్నానాలు, డ్రెస్ ఛేంజింగ్ రూమ్‌ల ఏర్పాటు
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

2



## మహా శివ రాత్రి మహోత్సవాల సందర్భంగా బందోబస్త్ ఏర్పాట్లును పర్యవేక్షించిన సీపీ



విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ : ఈ నెల 26న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలో పుణ్య స్నానాలు చేయు ప్రదేశాల అయిన దుర్గా మిగతా 2లో...



## జగన్ తీరు చూసి జనం చీదరించుకుంటున్నారు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్
- జగన్ లండన్ మందులు డోస్ ఎక్కువైంది
- సుభాష్ ఎద్దేవా రాష్ట్రాన్ని 19 లక్షల కోట్ల అప్పుల్లో ముంచాడు
- మంత్రి కొల్లు రవీంద్ర
- సంఖ్యాబలం లేకుండా ప్రతిపక్ష హోదా అడుగుతున్న జగన్ వైఖరిని పట్టభద్రులు గ్రహించాలి



వివరాలు 2లో..

## ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**పోలింగ్ ఏర్పాట్ల వివరాలను తెలియజేసిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ**



మచిలీపట్నం మేజర్ న్యూస్ : మంగళవారం స్థానిక కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ సహాయ రిటర్నింగ్ అధికారి డిఆర్ఓ కే చంద్రశేఖర రావు తో కలిసి మీడియా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు, ఇతర అంశాలను వివరిస్తూ.... కృష్ణ- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జిల్లా పరిధిలో 63,114 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు.ఈనెల 27వ తేదీ గురువారం జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. 2

(మొదటిపేజీ తరువాయి)

### మహా శివరాత్రి పుణ్య స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లను దర్శించుకోనున్న నేపథ్యంలో ఆలయంతో పాటు ముఖ్య ప్రాంతాల్లో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం తెలిపారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం అధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్, వీఎంసీ, మత్స్య, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులకు ఏర్పాట్లపై మార్గనిర్దేశనం చేసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దుర్గా ఘాట్, పింఢ ప్రదానం ఘాట్, పున్నమి ఘాట్, భవానీ ఘాట్, వీఐపీ ఘాట్ తదితరాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఉంటుందన్నారు. నిరంతర గస్తీతో పాటు క్యూలైన్లు, బ్యారికేడింగ్ పైనా ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీస్ పికెట్లతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యమైన పున్నమి, భవానీ ఘాట్ల తదితరాల వద్ద జల్లు స్నానాలు, డ్రెస్ ఛేంజింగ్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, నిరంతర పారిశుధ్యం ఏర్పాట్లు ఉంటాయన్నారు. వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలతో పాటు అవసరమైన మందులు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఘాట్ల వద్ద వెలుతురు సరైన విధంగా ఉండేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అన్ని ఘాట్ల వద్ద సుశిక్షితులైన గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. గొల్లపూడి, సూరయపాలెం, పవిత్ర సంగమం వద్ద కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించేందుకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ విస్తరణ అధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

### మహా శివ రాత్రి మహోత్సవాల సందర్భంగా
## బందోబస్త్ ఏర్పాట్లును పర్యవేక్షించిన సీపీ



ఘాట్, పున్నమి ఘాట్, భవానిఘాట్, పవిత్ర సంగమం మొదలైన ఘాట్లను, క్యూ లైన్లు, శివాలయాల వద్ద భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునే విధంగా శాంతి భద్రతలు, ట్రాఫిక్ పరంగా క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించి, భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిబ్బంది అప్రమత్తంగా బందోబస్త్ విధులు నిర్వహించేలాగా చర్యలు తీసుకోవాలని పలు సూచనలు సలహాలను చేసినారు. అదే విధంగా నగరానికి అతి దగ్గరలో ఉన్న యనమలకుదురు శివాలయం కు వెళ్ళు రహదారులలో, పరిసర ప్రాంతాలలో శాంతి భద్రతలు, ట్రాఫిక్ పరంగా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా బందోబస్త్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కృష్ణా జిల్లా ఎస్.పి. ఆర్.గంగాధర్ రావు ఐ.పి.ఎస్.తోపాటు యనమలకుదురు శివాలయం టెంపుల్ కు వెళ్ళి ధర్శన అనంతరం శివాలయం, పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ క్రమంలో టెంపుల్ పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సి.సి.కెమెరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ... మహా శివరాత్రి సందర్భంగా ఎక్కడా ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్‌లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని స్నాన ఘాట్లలో ఎన్.డి.ఆర్.ఎఫ్./ఎస్.డి.ఆర్.ఎఫ్.సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని, ఎక్కడా ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ఉండెందుకు సంబంధిత అన్ని శాఖల సమన్వయంతో బందోబస్త్ ఏర్పాట్లను చేయడం జరిగిందని, అందరూ ఆనందోత్సాహాల మధ్య మహా శివరాత్రి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, ప్రజలకు మహాశివరాత్రి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్, కృష్ణా జిల్లా ఎస్.పి. ఆర్.గంగాధర్ రావు ఐ.పి.ఎస్., డి.సి.పి. లు గౌతమి షాలి ఐ.పి.ఎస్.గారు, కృష్ణ మూర్తి నాయుడు, ఏ.డి.సి.పి. ఏ.వి.ఎల్.ప్రసన్న కుమార్, ఏ.సి.పి.లు, ఇన్స్పెక్టర్లు,, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక బృందాలతో గట్టి నిఘా పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

క్షుణ్ణంగా వివరించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం ఒక్క కుటుంబానికే కాదు.. మొత్తం సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని.. ఈ నేపథ్యంలో ఉత్పత్తి, రవాణా, వినియోగం.. ఈ మూడు దశలపై సమన్వయ శాఖల అధికారులు పటిష్ట నిఘా పెట్టి జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషిచేయాలని సూచించారు. యువత భవిష్యత్తును నాశనంచేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో పూర్తిగా అణచివేసేందుకు అధికారులు కృషిచేయాలని.. ప్రధానంగా మూలాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. జిల్లాలో 10 ఈగల్ వాహనాలు ఉన్నందున, ఈ బృందాల ప్రణాళికాయుత చర్యల ద్వారా మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలలో యాంటీ నార్కోటిక్ క్లబ్‌లు ఏర్పాటు చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాను మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు అధికార యంత్రాంగం చొరవకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

జిల్లాలో మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్, ఈగల్ బృందాలు తీసుకుంటున్న చర్యలను డీసీపీ కేజీవీ సరిత వివరించారు. 40 యాంటీ నార్కోటిక్స్ స్క్వాడ్స్, డివిజన్ స్థాయిలోని సురక్షా కమిటీల పనితీరు, 1972 టోల్‌ఫ్రీ నంబరు సేవలు తదితరాలతో పాటు నియంత్రణ చర్యల్లో డ్రోన్ టెక్నాలజీ వినియోగం, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం ప్రకారం తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించారు. సమావేశంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీఈవో యూవీ సుబ్బారావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి సీఎస్ఎస్ఎన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# జగన్ తీరు చూసి జనం చీదరించుకుంటున్నారు

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** జగన్ మాట్లాడుతున్న తీరు చూసి జనం చీదరించు కుంటున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం చల్లపల్లిలోని వివేకానంద డిగ్రీ కళాశాల, విజయ హైస్కూల్ ఆవరణలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. శాసనమండలి ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో మంత్రి సుభాష్ మా ట్లాడుతూ వైయస్ఆర్ మరణానంతరం జగన్ పదవీ వ్యామోహం, ఉన్మాదం గమనించిన సోనియా గాంధీ ఆయనను ప్రోత్సహించలేదన్నారు. అవినీతి కేసు ల్లో జైలు పాలైన తర్వాత ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారన్నారు. జగన్ తీరు గమనించి రాష్ట్ర ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ప్రతిపక్ష హోదా కావాలనడం ఆయన మానసిక స్థితికి నిదర్శనం అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ ప్రెస్ మీట్లలో మాట్లాడుతున్న మాటలు గమనిస్తే లండన్ మందులు పవర్ ఎక్కువైనట్లు ఉన్నా యని అనిపిస్తోందని మంత్రి సుభాష్ ఎద్దేవా చేశారు. విమర్శలు స్వీకరించలేని, ఓటమిని జీర్ణించుకోలేని వైఖరి జగన్మోహనరెడ్డిది అన్నారు. జగన్ వైఖరి గమ నించిన పట్టభద్రులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు సార్వత్రిక ఎన్నికలకు ముందే వైసీపీ పరిపాలనపై సమర శంఖం పూరించి మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారన్నారు. ఇలాంటి జగన్ మద్దతు పొందిన పీడీఎఫ్ అభ్యర్థిని ఓడించి సుపరిపాలన అందిస్తున్న కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదును అత్యధి క ఓట్ల మెజారిటీతో గెలిపించాలని మంత్రి సుభాష్ కోరారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర , అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో తెచ్చిన ప్రజా వ్యతిరేక విధానం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తొలి సారి వ్యతిరేకించి ఆ చట్టం రద్దుకై పోరాడిన ఘనత న్యాయవాదులకే దక్కిందన్నారు. అసెంబ్లీలో సంఖ్యాబలం లేకపోయినా ప్రతిపక్ష హోదా అడుగుతున్న జగన్ వైఖరి హర్షణీయమా అని పట్టభద్రులు గమనించాలన్నారు. సామాన్య ప్రజలను ఇంకా మభ్య పెట్టాలని జగన్ ప్రయత్నం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఘోర పరాజయం పొందినా జగన్ ఆలోచనా విధానం మారలేదని, జనం తిరస్కరించినా జగన్ తీరు మార్చుకోవట్లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి అఖండ విజయాన్ని చేకూర్చి పట్టభద్రులు మరోసారి జగన్మోహనరెడ్డికి బుద్ధి చెప్పాలని బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ నియోజ కవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి,టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, టీసీ అధ్యక్షులు గొరిపర్తి సుబ్బారావు, జనసేన టౌన్ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు, కూటమి నాయకులు మోర్ల శివ, బాదర్ల లోలాక్షు నాయుడు, మేడికొండ విజయ్, కొల్లూరి వాసు, తోట కనకదుర్గ, పసుపులేటి రవి, సూదాని నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో 63,114 మంది ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, ప్రశాంతంగా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం ఓటర్లకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.పోలింగ్ కు 48 గంటల ముందుగా సైలెంట్ పీరియడ్ అమల్లోకి వస్తుందని, సెక్షన్ 144 అమల్లోకి వస్తుందని, ఆ సమయంలో ఎటువంటి ప్రచారాలూ చేయరాదని పేర్కొన్నారు.25వ తేదీ సాయంత్రం 4.00 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ ఉంటుందని స్పష్టం చేశారు. 77 పోలింగ్ కేంద్రాల్లో ఓటెయ్యనున్న 63,114 మంది జిల్లాలో 31 లొకేషన్స్ లో 77 పోలింగ్ కేంద్రా లు ఉన్నాయని, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా 477 మంది అధికారులను, సిబ్బందిని కేటాయించామని వివరించారు. వీరిలో 94 మంది ప్రిసైడింగ్ అధికారులు, 92 మంది ఏపీవోలు, 199 మంది ఓపీవోలు ఉన్నారని తెలిపారు. వీరితో పాటు 92 మంది మైక్రో అబ్జర్వర్లు కూడా ఉంటారని తెలిపారు. జిల్లా పరిధిలో మొత్తం 63,114 మంది ఓటర్లు ఉన్నారని వారిలో 35,321 మంది పురుషులు, 27,789 మంది మహిళలు,4 గురు థర్డ్ జెండర్స్ ఉన్నారన్నారు. 77పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు. మార్చి 03వ తేదీన గుంటూరులో ఓట్ల లెక్కింపు జరుగుతుందని, 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని స్పష్టం చేశారు. మూడు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు,పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేసేందుకు అనువుగా జిల్లా పరిధిలో మచిలీపట్నం నోబుల్ కళాశాల, గుడివాడ,ఉయ్యూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయా లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. 26వ తేదీ ఉదయం నుండి పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ అందజేస్తారని చెప్పారు. అలాగే 27వ తేదీ సాయంత్రం పోలింగ్ సిబ్బంది నుంచి రిసెప్షన్ కేంద్రం వద్ద మెటీరియల్ స్వీకరిస్తారని పేర్కొన్నారు. మెటీరియల్ ను, సిబ్బందిని తరలించేందుకు అనువుగా తగినన్ని వాహనాలను అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అన్ని జిల్లాలకు తగినంత మెటీరి యల్ సిద్ధం చేశామని పేర్కొన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు,ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తగినంత మందిని నియమించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ఏజెంట్లు, సిబ్బందితో పాటు ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రం లోపలికి సెల్ ఫోన్లు తీసుకెళ్లరాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.పోలింగ్ నిర్వహించే జిల్లాలోని 77 పోలింగ్ కేంద్రాలలో ఉన్న విద్యాసంస్థలకు ఈనెల 26, 27వ తేదీ రెండు రోజులు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు.అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, వీల్ చైర్లు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లుగా నమోదైన పట్టభద్రులు ఓటు వేసేటప్పుడు అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో 1,2,3 సూచిస్తూ బ్యాలెట్ పేపర్లో నమోదు చేయాలన్నారు. ఓటరు పోలింగ్ స్టేషన్ కు వచ్చేటప్పుడు సాధారణ ఓటరు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని లేనియెడల ఆధార్ కార్డ్,డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, పాస్ పోర్టు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు లేదా ఇతర ప్రైవేట్ పారిశ్రామిక సంస్థలు ద్వారా ఉద్యోగులకు జారీ చేయబడిన సేవా గుర్తింపు కార్డు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేయబడిన అధికారిక గుర్తింపు కార్డులు. సంబంధిత ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ల నియోజకవర్గానికి చెందిన ఓటర్లు ఉద్యోగంలో ఉన్న విద్యాసంస్థల చేజారీ చేయబడిన సేవా గుర్తింపు కార్డు,యూనివర్సిటీ జారీ చేసిన డిగ్రీ డిప్లొమా ఒరిజినల్ సర్టిఫికేట్, కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన ఫిజికల్ హ్యాండీక్యాప్ ఒరిజినల్ సర్టిఫికేట్, భారత ప్రభుత్వం సామాజిక న్యాయం & సాధికారిక మంత్రిత్వ శాఖ వారిచే జారీ చేయబడిన ప్రత్యేక వైకల్యం ఐడి కార్డ్, వంటి పది రకాల గుర్తింపు పత్రాలను తీసుకురావచ్చునని కలెక్టర్ డీకే బాలాజీ వివరించారు. ఓటర్ గా నమోదైన పట్టభద్రులు ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పాటిస్తూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

# స్టడీ గ్రూప్ విద్యా భాగస్వామిగా ఫ్లోరిడా అట్లాంటిక్ విశ్వవిద్యాలయం



**విజయవాడ మేజర్ న్యూస్** : ఫ్లోరిడా అట్లాంటిక్ విశ్వవిద్యాలయం లాభదాయకమైన అంతర్జాతీయ కెరీర్ అవకాశాలన కోసం చూసే భారతీయ విద్యార్థులకు ప్రీమియం విద్యా కేంద్రంగా నిలుస్తోందని స్టడీ గ్రూప్ రీజినల్ డైరెక్టర్ కరణ్ లలిత్ తెలిపారు. స్టడీ గ్రూప్ విద్యాభాగస్వామిగా ఫ్లోరిడా అట్లాంటిక్ విశ్వవిద్యాలయం వ్యవహరిస్తుందన్నారు. ప్రపంచ స్థాయిలో విద్యార్థులను విజయానికి సిద్ధం చేసే అగ్రగామి సంస్థ స్టడీ గ్రూప్ భాగస్వామ్యంలో ఈ విశ్వవిద్యాలయం విద్యా, పరిశోధనా ఆవిష్కరణలకు ప్రసిద్ధి చెందింది. ఫ్లోరిడాలోని అత్యంత వైవిధ్యభరిత ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా, ఇది ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులకు వైవిధ్యమైన అవకాశాలను అందిస్తుందన్నారు. ఫిబ్రవరి 2025 నాటికి, ఫ్లోరిడా అట్లాంటిక్ అనేది కార్నెగీ క్లాసిఫికేషన్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ద్వారా రీసెర్చ్ 1 (ఆర్1) సంస్థ హోదా పొందిందన్నారు. ఆర్ 1 వర్గీకరణ అనేది యూ ఎస్‌ఏ లోని విశ్వవిద్యాలయాలకు అత్యంత ప్రతిష్టాత్మకమైన పరిశోధన పురస్కారం అని చెప్పారు. ఈ హోదా ఒక విశ్వవిద్యాలయాన్ని "చాలా ఉన్నత పరిశోధనా కార్యకలాపాలు" కలిగి ఉన్నట్లు సూచిస్తుందని, ఇది యూ ఎస్ లోని విశ్వవిద్యాలయాలలో అత్యంత ప్రతిష్టాత్మక పరిశోధన స్థాయి గా నిలుపుతుందన్నారు. కేవలం 187 యూఎస్ విశ్వవిద్యాలయాలు మాత్రమే ఆర్ 1 హోదాను కలిగి ఉన్నాయని, అందులో ఫ్లోరిడా అట్లాంటిక్ ఉందని చెప్పారు. ఫ్లోరిడా అట్లాంటిక్ విశ్వవిద్యాలయం విద్యార్థుల కోసం 400కు పైగా క్లబ్బులు సంస్థలను కలిగి ఉండి, సమ్మిళితత్వం, సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడానికి కట్టుబడి ఉందన్నారు. స్టడీ గ్రూప్ భారతీయ విద్యార్థుల అంతర్జాతీయ విద్యా ప్రయాణానికి ప్రతి దశలో బలమైన మద్దతుగా నిలుస్తుందని, ప్రత్యేకించి ఫ్లోరిడా అట్లాంటిక్ విశ్వవిద్యాలయంలో వారు నాణ్యమైన విద్య, విస్తృత అవకాశాలను అనుభవించేలా చేస్తుందన్నారు. భారతీయ విద్యార్థులు గ్లోబల్ స్థాయి ఉన్నత విద్యను అందిపుచ్చుకునేలా చేయడం, ప్రపంచ స్థాయి కెరీర్ అవకాశాలను సులభతరం చేయడం తమ ప్రధాన లక్ష్యం అని వివరించారు.

# రహదారి ప్రమాదాల నివారణలో మనమంతా భాగస్వామ్యులు అవుదాం


## బందరు డీఎస్పీ సిహెచ్.రాజా



**మచిలీపట్నం మేజర్ న్యూస్:** జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు ఆదేశాల మేరకు మంగళవారం పోలీస్ కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లు వాహన ఛోదకులకు బందరు డీఎస్పీ సిహెచ్.రాజా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ,వాహనదారులు అందరూ, రోడ్డు భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించి, తక్కువ వేగంతో వాహనాలలో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వ్యక్తులను కోల్పోవడమే కాకుండా, కుటుంబాలు ఆర్థికంగానూ, సామాజికగాను వెనుకబడటానికి రోడ్డు ప్రమాదాలు కారణమవుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, సంబంధిత రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని, తెలపడమే కాక పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ఆటోలు నడపకూడదన్నారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించుకొని నడిపితే వారిపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడమే కాక జరిమానాలు విధిస్తూ చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ట్రాఫిక్ చిహ్నాలను గుర్తుంచుకొని దానికి తగిన విధంగా వాహనాల నడపాలని తెలిపారు.వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ పోలీస్ వారికి సహకరిస్తూ ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం లేకుండా ఆటోలో నడపాలని తెలియచేస్తూ వారికి ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు ఎస్ వెంకటేశ్వరావు, టి మధుసూదన్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 100 రోబోటిక్ - సహాయక యూరాలజికల్ సర్జరీలను పూర్తి చేసిన

# మొదటి ఆసుపత్రి ప్రశాంత్ హాస్పిటల్





**విజయవాడ మేజర్ న్యూస్ :** దక్షిణ భారతదేశం లోని ప్రముఖ యూరాలజీ ఆసుపత్రులలో ఒకటైన ప్రశాంత్ హాస్పిటల్, 100 రోబోటిక్-సహాయక యూరాలజికల్ సర్జరీలను పూర్తి చేసినట్లు వెల్లడించింది. ముఖ్యంగా, నిర్వహించిన 100 శస్త్రచికిత్సలలో 40 సంక్లిష్టమైన పాక్షిక నెఫ్రెక్టమీలు కూడా ఉన్నాయి. ఇక్కడ సర్జన్లు శస్త్రచికిత్స సమయంలో ఆరోగ్యకరమైన కణజాలానికి హాని కలిగించకుండా, మూత్రపిండాల పనితీరును కాపాడే రీతిలో చికిత్స చేశారు. ఈ విధానం, డయాలసిస్ అవసరం వంటి దీర్ఘకాలిక సమస్యల సంభావ్యతను తగ్గించింది, తద్వారా రోగుల జీవన నాణ్యత గణనీయంగా మెరుగుపడింది. ఆసుపత్రి నిర్వహించిన కొన్ని సంక్లిష్టమైన కేసుల గురించి, ప్రశాంత్ హాస్పిటల్‌లో యూరో-ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ అయిన డాక్టర్ ప్రియతం కాసరనేని మాట్లాడుతూ, "మేము రెండు దశల రోబోటిక్-సహాయక ప్రక్రియను నిర్వహించాము - మొదట ఎడమ పాక్షిక నెఫ్రెక్టమీ అనంతరం రెండు వారాల తర్వాత కుడి పాక్షిక నెఫ్రెక్టమీ ని 60 ఏళ్ల పని చేసే వర్కింగ్ ప్రొఫెషనల్, ఇద్దరు పిల్లల తండ్రికి చేసాము. అతనికి బైలాటరల్ రెనల్ సెల్ కార్సినోమా (రెండు మూత్రపిండాల ఎగువ భాగంలో కాన్సర్ కణితులు) ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ విధానం తో గరిష్టంగా మూత్రపిండాల పనితీరును కాపాడుతూనే ఖచ్చితమైన రీతిలో కణితి తొలగింపును నిర్ధారిస్తుంది, రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స ప్రమాదాలను తగ్గిస్తుంది, త్వరగా కోలుకోవడానికి వీలు కల్పిస్తుంది. మరొక అద్భుతమైన సందర్భంలో, తరచుగా మూత్ర ఇన్ఫెక్షన్లు, అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్న ఆరు నెలల శిశువుకు యూరిటెరోపెల్విక్ జంక్షన్ (యుపిజె) అడ్డంకి ఉన్నట్లు నిర్ధారణ అయింది. అధునాతన డావిన్సీ రోబోటిక్ వ్యవస్థను ఉపయోగించి, అడ్డంకిని తొలగించడానికి, అతి తక్కువ కోత తో మేము ఖచ్చితమైన ప్రక్రియను నిర్వహించాము. శిశువు సజావుగా కోలుకుంది, 24 గంటల్లోపు ఆహారం తిరిగితీసుకోవటం ప్రారంభించింది, కేవలం మూడు రోజుల్లోనే డిశ్చార్జ్ చేయబడింది" అని అన్నారు. ఈ విజయంపై ప్రశాంత్ హాస్పిటల్‌లోని రోబోటిక్ సర్జన్ డాక్టర్ ధీరజ్ కాసరనేని మాట్లాడుతూ, "తాము అధునాతన డావిన్సీ రోబోటిక్ టెక్నాలజీని స్వీకరించడానికి ముందు,చాలా కేసుల లో పాక్షిక నెఫ్రెక్టోమీల వంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలు అవసరమయ్యే చోట లాపరోస్కోపిక్ సాధనాల్లోని పరిమితుల కారణంగా చాలాసార్లు మూత్రపిండాలను పూర్తిగా తొలగించడానికి దారితీశాయి. ఈ సాంకేతికతతో, మేము అవయవాలను కాపాడటమే కాకుండా, రోగులపై శారీరక, భావోద్వేగ భారాన్ని తగ్గించడంతో పాటు కనీస రక్త నష్టం, తగ్గిన మచ్చలు, శస్త్రచికిత్స అనంతర ఆసుపత్రి బస తక్కువగా ఉండటం వంటి అదనపు ప్రయోజనాలను కలిగిస్తున్నాము, రోగులను వేగంగా కోలుకునేలా చూస్తున్నాము " అని అన్నారు. "ఈ అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా, మేము మెరుగైన ఖచ్చితత్వంతో సంక్లిష్టమైన యూరాలజికల్ శస్త్రచికిత్సలను కూడా చేయగలుగుతున్నాము. 3డి హై-డెఫినిషన్ విజువలైజేషన్ అసమానమైన రీతిలో స్పష్టత, దృక్పథాన్ని లోతుగా అందిస్తుంది. ఫలితంగా మెరుగైన రీతిలో నియంత్రణ సామర్థ్యాన్ని, సున్నితమైన నిర్మాణాలతో కూడిన యూరాలజికల్ వ్యవస్థలోని సంక్లిష్ట శస్త్రచికిత్సా విధానాలకు మెరుగైన ఫలితాలను అందిస్తుంది.




## అత్యంత ఆధునికంగా శామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్ సర్వీస్ సెంటర్లు

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, తన స్మార్ట్‌ఫోన్ కస్టమర్ సర్వీస్ అనుభవాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడానికి సేవా కేంద్రాలను సమూలంగా పునరుద్ధరిస్తోంది. ప్రీమియం కస్టమర్ కేర్ మీద బలమైన దృష్టి సారించి, అమ్మకాల తర్వాత అత్యుత్తమైన మద్దతుకు శామ్‌సంగ్ నిబద్ధతను బలోపేతం చేస్తూ, సజావు సర్వీస్-టు-సేల్స్ ప్రయాణాన్ని ఏర్పాటు చేయడం ఈ చొరవ లక్ష్యం. యువ, డైనమిక్ కస్టమర్ బేస్ యొక్క అభివృద్ధి చెందుతున్న అంచనాలను తీర్చడానికి, శామ్‌సంగ్ తన సేవా కేంద్రాలను ఇంటిగ్రేటెడ్ ఓమ్ని-ఛానల్ అనుభవానికి అనుగుణంగా పునర్నిర్మించింది. ఈ ఆధునికీకృత కేంద్రాలు, అధునాతన డిజిటలైజ్డ్ ప్రక్రియలతో కూడినవిగా ఉండి, వేగవంతమైన, సమర్థవంతమైన సేవను అందించడానికి రూపొందించబడ్డాయి. వైవిధ్యమైన ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను ప్రదర్శించడమే కాకుండా, ఖచ్చితమైన సమస్యను గుర్తించేందుకు అత్యాధునిక డయాగ్నొస్టిక్ సాధనాలను వినియోగించడం ద్వారా, శామ్‌సంగ్ తన సాంకేతిక అగ్రభాగాన్ని మరింత బలోపేతం చేస్తోంది. అప్‌గ్రేడ్ చేయబడిన సర్వీసు కేంద్రాలు సాంప్రదాయ లేఅవుట్లకు భిన్నంగా, అధునాతన డిజైన్‌తో మరింత సౌకర్యవంతమైన లాంజ్ వంటి వాతావరణాన్ని అందిస్తాయి. ఇందులో అంతర్నిర్మిత వైర్‌లెస్ ఛార్జింగ్ స్టేషన్లు, ఖరీదైన సోఫా-శైలి సీటింగ్ ఉంటాయి. పునఃరూపకల్పన చేసిన గోడలు శామ్‌సంగ్ యొక్క ధరించగలిగిన ఉత్పత్తుల విస్తృత శ్రేణిని హైలైట్ చేస్తాయి. అల్ట్రా-లార్జ్ డిజిటల్ స్క్రీన్లు తాజా ఉత్పత్తి ఆవిష్కరణలను చూపించి సందర్శకులకు లీనమయ్యే అనుభవాన్ని అందిస్తాయి.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి ఒకరికి గాయాలు



**కంచికచర్ల ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** కీసర సమీపంలో గల ఇన్వెంటా కెమికల్ ఫ్యాక్టరీ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఇద్దరు వ్యక్తులు మృతి చెంది ఒకరు గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. సేకరించిన సమా చారం ప్రకారం విజయవాడ వైపు బైక్ పై ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తు డివైడర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఘటనలో ఇద్దరు వ్య క్తులు అక్కడికక్కడే మృతి చెందగా ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వ్యక్తిని హైవే అంబులెన్స్ ద్వారా నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు వ్యక్తులు విజయవాడ ఆటోనగర్కు చెందిన వారిగా సమాచారం. స్థానిక పోలీస్ వారు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అగ్రిగోల్డ్ కేసు పరిష్కారానికి

# ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అగ్రిగోల్డ్ సమస్య కోర్టులో సంవత్సరాలు తరబడి సాగుతూ ఉన్న తరుణంలో కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ క కాపీని అందజేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు మంగళవారం శాసనసభ్యులు వారి కార్యాలయంలో అందజేసిన వినతి పత్రంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నుండి ఒక కమిటీని ఏర్పాటు చేయమని అగ్రిగోల్డ్‌కు ఉన్న వ్యవసాయ భూములను చిన్నచిన్న ప్లాట్లుగా విభజించి అమ్మకం చేయాలని దీనికి ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.చంద్ర, బోలి సుధాకర్, వి.వెంకట్ నారాయణ రావు, ఎం.నెల బాలుడు, కృష్ణ కుమారి, ఎస్.మధుసూదన్ రావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, బుజ్జి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కే గగన్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.



## చురుగ్గా సంగమేశ్వర స్వామి తిరునాళ్ల ఏర్పాట్లు

**నందిగామ, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** దక్షిణ కాశీగా పేరుగాంచిన నందిగామ మండలం దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి తిరణాల పురస్కరించుకొని మాగల్లు సోమవారం రోడ్లు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులకు గ్రామపంచాయతీ అధికారులు చేపట్టారు.సంగమేశ్వర స్వామి తిరుణాల పురస్కరించుకొని మాగల్లు-సోమవరం, దాములూరు, తొర్రగుడి పాడు రహదారులు ఇరువైపులా దట్టంగా కంప చెట్లు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయని, ఈ రహదారిపై ద్విచక్ర ద్విచక్ర పలు వాహనాలు, రాకపోకలు సాగిస్తుంటారు ఈ నేపథ్యంలోవాహన చోదకులకు ప్రమాదాలు జరిగిన సంఘటనలు గతంలో నెలకొని ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమ వరం గ్రామపంచాయతీ నిధులతో ఇన్చార్జి కార్యదర్శి సాయి మాగల్లు-సోమ వరం గ్రామాల ఏడు కిలోమీటర్ల మేర రోడ్డు ఇరువైపులా దట్టంగా పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలు తొలగించారు.టిడిపి నాయకులు ఉప్పుకొండూరు గురు ప్రసాద్, మల్లేడి శ్యాం ప్రసాద్, బెల్లం కోటేశ్వరావు రహదారి జంగిల్ క్లియరెన్స్ పంచాయతీ అధికారులు చేపట్టిన పనులను పర్యవేక్షించారు.

## కుంభమేళలో పాల్గొన్న బిజెపీ నాయకులు



**నందిగామ, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** కుంభమేళాలో త్రివేణి సంగమం పుష్కర ఘాట్‌లో పుష్కర స్నా నమాచరించి గంగా హారతి పూజల నంది గామ భారతీయ జనతా పార్టీ సభ్యులు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బిజెపి కన్వీనర్ తొర్లి కొండ సీతారామయ్య, బిజెపి నాయకులు తులసి కృష్ణ తదితరులు మాట్లా డుతూ కుంభమేళాలో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏర్పాట్లు చక్కగా నిర్వహించాలని, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## సునీత, అలేఖ్యలు ఎన్ఎమ్ఎమ్ఎస్‌కు ఎంపిక అభినందనీయం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో గతంలో 1 నుండి 5 తరగతులు విద్యనభ్య సించి నేడు నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్ షిప్‌కు ఎన్నికైన డి. సునీత, ఎన్. అలేఖ్యలను కరస్పాండెంట్ సింగం శెట్టి ఆదినారాయణ, ఉపాధ్యాయులు అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ 8వ తరగతి నుండి ఇంటర్ వరకు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు విద్యార్థుల అకౌంట్లో జమచేసే ఎన్ఎమ్ఎమ్ఎస్ కు ఎంపిక హర్షణీయమని, సునీత, అలేఖ్యలు ముందుందు మరింత శ్రద్ధతో చదివి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాం క్షించారు. అలాగే తోటి విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో మంచి స్థాయి కి వెళ్ళాలన్నారు. కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి పివిజె రామారావు, గుడ్లవల్లేరు ఎంఇఓలు జగన్మోహన రావు, గోపాలరావు లు వీరిని అభినందించి, ప్రశంసించడం విశేషం.

# శ్రీ కోదండరామస్వామి దేవస్థానం అభివృద్ధికి పనులకు రూ.1,98,965 విరాళం





**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులకు తుమ్మల సుబ్బారావు రూ. 5000, తుమ్మల గోవర్ధన్ రావు రూ.5116, అట్లూరి శ్రీనివాసరావు రూ. 5116, ఎర్ర ఉదయ భాస్కర్ రూ.1116, అడుసుమిల్లి మనోహర్ రూ. 20,000, పరుచూరి నాగా ర్జున రూ.1000, తుమ్మల రమణ రూ. 5058, వడ్లపట్ల వీరాంజనేయులు రూ. 16000, దాసరి లతీష్ కుమార్ రూ. 2011, ఒబిళ్ళనేని నాగరాజు రూ. 5116, గోగినేని ప్రవీణ్ రూ. 2000, శృంగవరపు నాగ వీర వెంకట పద్మ కుమారి రూ. 10116, చలసాని ఆంజనేయులు రూ 25,000, మొవ్వ రోహిత రూ 18,500, సూరపనేని రాము రూ. 3000, పరుచూరి రాధాకృష్ణమూర్తి రూ. 25,000, జి రమేష్ రూ. 1116, కొల్లిపర శ్రీనివాస్ రూ. 10,116, బొబ్బ వెంకట రామకృష్ణ రూ. 1120, డాక్టర్ యనమదుల రమేష్ రూ. 5000, పరుచూరి ప్రేమ్ కుమార్ రూ. 2000, పొట్లూరి సీతారాం ప్రసాద్ రూ. 5116, చాపరాల వెంకట నాగ ఫణింద్ర రూ. 5116, ఉప్పల కిరణ్ కుమార్ రూ. 5116, అట్లూరి రాజశేఖర్ రూ. 5000, సుగసాని శ్రావణి రూ. 10116 రూపాయలు విరాళం అందజేసినట్లు శ్రీ కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి పరుచూరి సుకన్య తెలియజేశారు. ఈ సందర్భంగా పరుచూరి సుకన్య మాట్లాడుతూ కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధికి పనులకు ఈ వారం 198965 రూపాయలు వచ్చినట్లు తెలియజేశారు. అభివృద్ధి పనులకు ఇప్పటివరకు రూ. 388595 విరాళాలు వచ్చాయని విరాళాలు అందజేస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధి పనులకు నిధుల సేకరణలో తమ వంతు సహకారాన్ని అందిస్తున్న పరుచూరి ధన కోటేశ్వరరావు, పరుచూరి ప్రసాద్, పరుచూరి రామకృష్ణ లకు ఆమె అభినందనలు తెలియజేశారు.

# ఐలూరులో మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి







**తోట్లవల్లూరు ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం ఐలూరు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రామేశ్వర స్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రికి సంబంధించి ఘనంగా ఏర్పాట్లు చేశారు. దక్షిణ కాశీగా పేరుపొందిన ఈ దేవాలయానికి మహాశివరాత్రి పర్వదినాన ప్రతి ఏడాది లక్షలాదిమంది భక్తులు కృష్ణా నదిలో స్నానమాచరించి ఈ స్వామిని దర్శిం చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కృష్ణా నది వద్ద పెద్దలకు పిండ ప్రధా నాలు సమర్పించి అనంతరం కృష్ణా నదిలో స్నానమాచరించి ఈ స్వామివారిని దర్శించుకోవడం ఇక్కడ ప్రత్యేకత. ఈ దేవాలయంలో స్వామిని దర్శించుకుని కోరుకున్న కోరికలు 40 రోజుల్లోగా నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వా సం. ఈ మహాశివరాత్రి వేడుకలకు ఈ ప్రాంతం నుండే కాక ఇతర జిల్లాల నుండి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు ఐలూరు విచ్చేస్తారు. ఇందుకోసం ఆర్టీసీ సంస్థ కూడా మచిలీపట్నం, పామర్రు, ఉయ్యూరు, కూచిపూడి తదితర ప్రాం తాల నుండి ఐలూరు కు ప్రత్యేక బస్ సర్వీస్ లను ఏర్పాటు చేస్తుంది. ఇవి కాక ప్రైవేట్ వాహనాలు సైతం వందల సంఖ్యలో ఈ ప్రాంతానికి చేరుకుం టాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పమిడిముక్కల సీఐ వై.చిట్టిబాబు ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ఈ దేవాలయంకు సంబంధించి భక్తులకు ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనాలుగా 10, 20 రూపాయలు ధర నిర్ణయించి దర్శనాలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేగాక దర్శనానికి వచ్చే భక్తులకు పులిహోర, లడ్డు ప్రసాదాలను అందించేందుకు ఏర్పాటు చేస్తు న్నారు. కృష్ణా నదిలో స్నానాలకు సంబంధించి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొంత ప్రాంతంలో నీరు లేకపోవడంతో అక్కడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జల్లు స్నానాలను ఏర్పాటు చేస్తున్నారు. కొంత ప్రాంతంలో నీరు ఉన్నప్పటికీ భక్తులు లోపలికి వెళ్ళవద్దని ఇటీవల సంభవించిన వరదల కారణంగా గుండాలు ఏర్పడ్డాయని అందువలన భక్తులు తగు జాగ్రత్తలు తీసుకుని కృష్ణా నదిలో స్నానమాచరించాలని భక్తులకు అధికారులు విజ్ఞప్తి చేశారు. ఆలయంలో తెల్లవారుజాము నుండి రాత్రి 10 గంటల వరకు దర్శనాలకు ఏర్పాటు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు లంక మురళి వాసుదేవశాస్త్రి తెలిపారు. రాత్రికి స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం జరుగుతుందని అన్నారు. గురువారం స్వామి వారి రథోత్సవ కార్యక్రమం, శుక్రవారం స్వామివారి గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు సహకారం అందించి ఈ శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలిగినా తమను సంప్రదించాలని ఈ సందర్భంగా దేవాలయ కార్యనిర్వహణాధికారి బి.వి.ఎస్.గోపాలరావు కోరారు.

# గ్రామాల పరిశుభ్రతకు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడదాం






**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గుడ్లవల్లేరు, గుడివాడ, నందివాడ మండలాల అధికారులు, సిబ్బందికి శానిటే షన్ కార్యక్రమాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గుడ్లవల్లేరు ఎంపిడిఓ టి. విజయ సారధి అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమంను తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి వందేమాతరం ప్రార్థనగీతంతో ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా పంచాయతీ రిసోర్స్ పర్సన్స్ కమలాకర్, కృష్ణవేణిలు శిక్షణ నిర్వహిస్తూ చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు, మైక్రో, మినీ, మీడియం, లార్జ్ షెడ్ల వర్గీకరణ గురించి, గ్రామంలో పశుపక్ష్యాదులు చనిపోయినప్పుడు సంస్కార యార్డులకు తరలిచి సంస్కార కార్యక్రమాలు నిర్వహించడం, ఇండ్లవద్ద పేరుకుపోయిన పనికిరాని పాత వస్తువులను ప్రత్యేక యార్డుకు తరలించడం వంటి కార్యక్రమాలన్నీ పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులే నిర్వహణ చేయడం గురించి వివరించారు. గ్రామంలో రోడ్లవెంబడి, ఇండ్లవద్ద చెత్త నిల్వలుండడం ద్వారా వచ్చే అనర్థాల గురించి గ్రామస్తులకు వివరిస్తూ తడి చెత్త, పొడి, హానికర చెత్తలను ఇంటి వద్దనే వేరుచేసి సేకరించడం గురించి, ఎస్ డబ్ల్యు పి సి షెడ్డు వద్ద చెత్త నుండి సంపద తయారీ విధానాలపై అవగాహన కలుగచేసారు. శిక్షణ తరగతులకు అతిథిగా విచ్చేసిన గుడివాడ డివిజనల్ పంచాయతీ అధికారి సంపత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా చెత్తల సేకరణ, సంపద కేంద్రాలను పకడ్బందీగా నిర్వహణ చేయాలన్న ఆదేశాలతో జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షణలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, శానిటరీ సిబ్బంది చెత్తల సేకరణ, ఎస్ డబ్ల్యు పి సి షెడ్ల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించి గ్రామాల పరిశు భ్రతకు, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడదామన్నారు. అదేవిధంగా గుడ్లవల్లేరు, గుడివాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు విజయ సారధి, బివి విష్ణు ప్రసాద్ లు, పంచాయతీ విస్తరణాధికారులు, 3 మండలాల పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, క్లాప్ మిత్రాలు, షెడ్ మిత్రాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం పూట తడి పొడి చెత్త ప్రాసెసింగ్ పై అవగాహన కల్పించడం, మధ్యాహ్నం పూట గుడ్లవల్లేరు ఎస్ డబ్ల్యు పిసి షెడ్డు వద్ద సంపద తయారీలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలను గుడ్లవల్లేరు పంచాయతీ కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు, సిబ్బంది ఆద్యంతం పర్యవేక్షణచేస్తూ, నిర్వహణ చేయడాన్ని డిఎల్పిఒ, ఎంపిడిఓ లు ప్రశంసించారు.

# మిర్చి క్వింటా రూ.11,781 రైతులకు గిట్టుబాటు కాదు



**మిర్చి మార్కెట్ ధర కంటే ఎక్కువ ధర ఉందని రైతులను మాయచేస్తున్న ప్రభుత్వం**

**ఎకరాకు క్వింటాకు రూ.20,000 చొప్పున చెల్లించాలి**

**మిర్చి రైతులను తండ్రి, కొడుకు మోసం చేశారు**

**కోలుకోలేని నష్టాలు, కుంగిపోతున్న మిర్చి రైతాంగం**

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** పట్టణంలో వైస్సార్సీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. మిర్చి రైతులకి గిట్టుబాటు ధర కల్పించడంలో మోసం చేసిన కూటమి ప్రభుత్వ గురించి, మిర్చి రైతులకు సరైన గిట్టుబాటు ధర ఇవ్వాలని మీడియా ద్వారా నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో క్వింటాకు 10000, 12000 ఉంటే రూ. 11,781 గిట్టుబాటు ధర అనేది రైతులకు మేలు జరిగినట్లేనా? వాస్తవానికి ప్రతిపక్ష నేతలు, రైతు సంఘాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతులు అడిగేది ఏమిటంటే మిర్చికి క్వింటాకు 20వేల రూపాయలు గిట్టుబాటు ధర అందించాలని కోరుతుంటే, ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వం రూ.11,781లు గిట్టుబాటు ధర ప్రకటించి రాష్ట్రంలో రైతులు ఇంకా సంతోషమే, వారి బాధలన్నీ పోయినట్టే బాగుపడినట్టే, అన్నట్టుగా ఈ కూటమి ప్రభుత్వం చూస్తుంది. మిర్చి గిట్టుబాటు ధర అనేది ఏ ప్రామాణిక ఆధారంగా నిర్ణయించారో తెలియదు కానీ, రైతుకు గిట్టుబాటు ధర నిర్ణయాల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోండి తప్ప మీరేదో ఢిల్లీలోనో, ఆఫీసుల్లోనూ అమరావతి లోను కూర్చొని ఈ ధర ప్రకటించడం సరి అయినది కాదు అని తెలిపారు. వ్యవసాయశాఖ ఈ-క్రాప్ ఆధారంగా సాగుదారులు, పంట విస్తీర్ణాన్ని పరిశీలించి ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి లెక్కన సాయం అందించేలా చూడండని రైతులు కోరుతున్నారు. ఏది ఏమైనా సరే ఇప్పటికైనా ప్రభుత్వం రైతులు పక్షాన ఆలోచించి మిర్చికి క్వింటాకు 20వేల రూపాయలు గిట్టుబాటు ధర అందించి రైతులని ఆదుకోవాలని పేర్కొన్నారు.

## పెళ్ళి కొడుకుగా ముస్తాబైన శ్రీ సంగమేశ్వర స్వామి



**నందిగామ, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్:** దక్షిణ కాశీగా పేరు గాంచిన నందిగామ మండలం దాములూరు కూడలి గ్రామంలో మహాశివరాత్రి పురస్కరించుకొని శ్రీ పార్వతీ సహిత సంగమేశ్వర స్వామి ఆలయ తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి, ఆలయ ఈవో నారాయణ నరసింహమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యుడు గింజుపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు దాములూరు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, సంగమేశ్వర స్వామి వారిని పెళ్లి కుమారుని చేయటం, పుణ్యాహవాచనం మండపారాధన, అంకురారోపణ అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణ బలిహరణ పూజలు వేదమంత్రోచ్చారణ నడుమ వేదక్తంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరులో ఎమ్మెల్సీ ఎన్నికలకు సకల ఏర్పాట్లు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 27న కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా గుడ్లవల్లేరు మండలంలో పోలింగ్ బూత్ ల వద్ద సకల ఏర్పాట్లుచేసారు. ఈసందర్భంగా గుడ్లవల్లేరు ఎస్ఇఆర్ఎమ్ హైస్కూల్ ప్రాంగణంలోని పోలింగ్ బూత్ లు 169/3, 170/3 లను రెవిన్యూ ఇన్స్పెక్టర్ పొట్లూరి శివకుమార్ పరిశీలించారు. పట్టభద్ర ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించేందుకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా మండలంలో పోలింగ్ బూత్ లవద్ద సకల ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఐ శివకుమార్ పేర్కొన్నారు. విఆర్వోలు శాయన ప్రకాష్, వెంకటేశ్వరరావు, నాగరాజు, మల్లిఖార్జునరావు, రవిశరత్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తనోత్పత్తి బృందం రైతుల అభిప్రాయం సేకరించారు



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల క్షేత్రములో బ్రీడర్ విత్తనోత్పత్తి చేయుచున్న పొలాలను విత్తనోత్పత్తి పర్యవేక్షణ బృందంతో పాటు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా వి సత్యప్రియ లలిత సోమవారం పరిశీలించారు. రైతులకు మేలైన విత్తనాలను అందించడంలో కే వి కే ప్రధాన పాత్ర పోషించాలని బృందం పేర్కొన్నారు. విత్తన నాణ్యతా ప్రమాణాలు పరిశీలించగా మెరుగుగా ఉన్నాయన్నారు. తదుపరి చిరు సంచుల దశలో ఉన్నట్టు వంటి టీబీజీ 141, జి బి జి 190 మినుము రకాల పని తీరును చీడ పీడల తట్టుకునే శక్తి మొదలగు అంశాలను గూర్చి క్షేత్ర స్థాయిలో సందర్శించి రైతుల అభిప్రాయములను సేకరించారు. ప్రధాన శాస్త్రవేత్త అపరాలు డా. డి. మోహన్ రెడ్డి, కృష్ణా మండలి విత్తనోత్పత్తి అధికారి డా.ఎన్. హరిసత్యనారాయణ, ప్రధాన విభాగ ప్రధాన శాస్త్రవేత్త డా. జే. సతీష్ బాబు, సమన్వయ కర్త డా. సుధా రాణి, శాస్త్రవేత్తల బృందం డా. వెంకటలక్ష్మి, డా. నవీన్, డా. రేవతి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు బృందం అభ్యుదయ రైతులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, వేమూరి రత్న గిరి రావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** ఈ నెల 27న కృష్ణా-గుంటూరు జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఆ రోజు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటు హక్కు ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రకటించినట్లు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్న దృష్ట్యా ప్రైవేటు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర సంస్థలు కూడా ఓటరుగా నమోదు చేసుకున్న తమ ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు విధుల సమయాన్ని తగ్గించడం లేదా షిఫ్టులను సర్దుబాటు చేయడం వంటి వెసులుబాట్లు కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.



## కూలింగ్ క్యానులు అందజేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ

**నందిగామ, జనవరి 25, మేజర్ న్యూస్:** నగర మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ పరిచయ కార్యక్రమంలో భాగంగా గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది వారు ఎదుర్కొంటున్న మంచినీటి కొరతను చైర్ పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన చైర్ పర్సన్, కమిషనర్ స్పందించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పది వార్డు సచివాలయాల సిబ్బందికి మంచినీటి కూలింగ్ క్యాన్లను నందిగామ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణ కుమారి అందజేశారు. ఈ కార్యక్రమంలో 18 వ వార్డు కౌన్సిలర్ బండారు గంగమ్మ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ బాలాజీని కలిసిన కేయువిసీ రామ్ జీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మంగళవారం కలెక్టరేట్లోని చాంబర్లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కృష్ణ యూనివర్సిటీ ఉపకులపతి కూన రామ్ జి మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఉప్పలమ్మ ఎల్లమ్మ అమ్మవార్ల పూజా కార్యక్రమంలో సామినేని



**జగ్గయ్యపేట రూరల్ మేజర్ న్యూస్:** జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన బిసి నాయకులు బండి నరేష్ స్వగృహంలో ఉప్పలమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల పూజ కార్యక్రమం లో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను, జనసేన యువ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు, కౌన్సిలర్ కొలగాని రాము, కాశీ కిషోర్, ఆంధ్ర ప్రదేశ్ బిసి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి ప్రషాద్, మాజీ సర్పంచ్ బజారు రవి జనసేన నాయకులు షౌకత్ అలీ, బజారు సాయి కుమార్, కాకర్ల లక్ష్మీ నారాయణ, మాదుగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు




**తోట్లవల్లూరు ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తోట్లవల్లూరు మండలం ఐలూరు గ్రామంలో గల శ్రీ రామేశ్వర స్వామి దేవాలయంలో జరిగే ఉత్సవాలకు సంబంధించి పోలీస్ శాఖ పలు చర్యలను చేపట్టిందని పమిడిముక్కల సిఐ వై.చిట్టిబాబు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తదితర అంశాలను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సుమారు 80 మంది పోలీస్ సిబ్బంది మరో 40 మంది ఎన్ సిసి వాలంటీర్ ల ద్వారా తమ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేపట్టిందన్నారు.

క్యూ లైన్లు, ప్రసాదాల పంపిణీ, స్నాన ఘట్టాలు వంటిచోట్ల ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ఐలూరు గ్రామానికి వివిధ రూట్ల నుండి వచ్చే వాహనాలు, ఆర్టీసీ బస్సుల పార్కింగ్‌కు ప్రత్యేకంగా ఆరు పార్కింగ్ ప్రదేశాలను ఎంపిక చేసామని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల వాహనాలను తమ సిబ్బంది నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపేలా చర్యలు చేపడతారని తెలిపారు. భక్తులు కూడా తమ సిబ్బందికి సహ కారం అందించి ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు చోటు చేసుకోకుండా శివరాత్రి మహో త్సవాలు విజయవంతం అయ్యేలా సహకరిం చాలని సిఐ చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికల ప్రక్రియ విజయవంతానికి
# సహకారం అందించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈనెల 27వ తేదీన జిల్లాలో నిర్వహించే కృష్ణ- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల నిర్వహణపై మంగళవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆయన చాంబర్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన నిర్వహించే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. జిల్లాలో 63 వేల 114 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మచిలీపట్నం నోబుల్ కళాశాల, గుడివాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, ఉయ్యూరు మార్కెట్ యార్డులలో పోలింగ్ సామాగ్రి పంపిణీకి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 77 పోలింగ్ కేంద్రాలలో 42 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 35 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వంకు జరుగుతుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు వీల్ చైర్లు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ సక్రమంగా సజావుగా జరిగేందుకు పూర్తి సహకారం అందించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారి డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, రాజకీయ పార్టీలు ప్రతినిధులు కొడాలి శర్మ, బీజేపీ, పీవీ గజేంద్ర రావు కాంగ్రెస్ పార్టీ కే. ఫణి భూషణ్, జనసేన పార్టీ కే. వెంకట్రావు, బీఎస్పీ ఎస్ బాలాజీ ఉన్నారు.



ఆత్మీయ సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి ల పిలుపు



**తోట్లవల్లూరు ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** గత తొమ్మిది నెలల కాలంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలును గుర్తించి ఈనెల 27వ తేదీన జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విజ్ఞప్తి చేశారు. పామర్రు నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన తోట్లవల్లూరులో నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మరో అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ కృష్ణ గుంటూరు జిల్లాల శాసనమండలి ఎన్నికలలో కృష్ణా జిల్లా నుండి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు అత్యధిక మెజార్టీ సాధించేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాం అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, తెలుగుదేశం పార్టీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, గొట్టిపాటి లక్ష్మీ దాసు, లింగమనేని రామలింగేశ్వరరావు, మైనేని ఇందిర, చింతపల్లి వెంకటేశ్వరావు, జన్ను శోభన్ బాబు, గన్నే నారాయణ ప్రసాద్ (అన్నా), నెక్కలపు మురళి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నీలాయపాలెం విజయ కుమార్, కృష్ణా డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, బిజెపి గుడివాడ నియోజకవర్గ ఇన్చార్జి దావులూరి సురేంద్రబాబు, జనసేన పార్టీ మండల ఇన్చార్జి కృష్ణ సుమన్, ఎమ్మెల్యే సోదరులు వర్ల చాణిక్య, వర్ల చైతన్య తదితరులతోపాటు నియోజవర్గ పరిధిలోని కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధికోసం 'ఆలపాటి' ని గెలిపించుకుందాం



**హనుమాన్ జంక్షన్, మేజర్ న్యూస్ :** రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలంటే కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు అత్యవసరమని గన్నవరం నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్ మెంట్ కోఆర్డినేటర్, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు పేర్కొన్నారు. గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సూచనల మేరకు మంగళవారం ఉదయం బాపులపాడు మండలంలోని కొత్త మల్లవల్లి, రేమల్లె, సింగన్నగూడెం, కోడూరుపాడు, రంగన్నగూడెం గ్రామాలలో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు విస్తృతంగా పర్యటించి ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రాడ్యుయేట్ ఓటర్లను అభ్యర్థిస్తూ మోడల్ బ్యాలెట్ పేపర్లను అందజేశారు. ప్రచార కార్యక్రమంలో రంగన్నగూడెం ఎంపీటీసీ సభ్యులు పుసులూరి లక్ష్మినారాయణ, గ్రామ టీడీపీ అధ్యక్షులు మొవ్వా వేణుగోపాల్, క్లస్టర్ ఇన్చార్జి కలపాల కుమార్, యూనిట్ ఇన్చార్జి కసుకుర్తి కృష్ణకిషోర్, టీడీపీ నాయకులు కసుకుర్తి అర్జునరావు, కనకవల్లి శేషగిరిరావు, పల్లగాని వెంకట నాగేశ్వరరావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, మల్లవల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు షేక్ జాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ దేశం నాయకుల విస్తృత ప్రచారం



**తోట్లవల్లూరు ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన తోట్లవల్లూరు లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగుదేశం నాయకులు ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ పేపర్లో మొదటి పేరు ఉన్న ఆలపాటికి ఒకటి అంకె వేసి ఆయనను గెలిపించాలని ఈ సందర్భంగా నాయకులు ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాం, కార్యదర్శి లుక్కా రేణుకారావు, స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోదరులు వర్ల చాణిక్య, వర్ల చైతన్య లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఆలపాటి గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయండి



ఆలపాటిని గెలిపించాలంటూ దేశం నాయకుల ప్రచారం

**పమిడిముక్కల, మేజర్ న్యూస్ :** కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల ప్రజా పరిషత్ కార్యాలయం, సచివాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ముళ్ళపూడి సునీత, సీనియర్ నాయకులు జక్కా శ్రీనివాస రావు, కృష్ణాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెండ్ల సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు మైనేని నరేంద్ర, ఆముదాలపల్లి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థి ఆలపాటికి తొలి ప్రాధాన్యత ఓటెయ్యండి

### టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు



**నందిగామ, మేజర్ న్యూస్ :** తెలుగు దేశం జనసేన, బిజెపి బలపరిచిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణం టీడీపీ కార్యాలయంలో ఆయన ఎన్నికల ప్రచారం చేసి కలిసి కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ కృష్ణకుమారి, నందిగామ పట్టణ పార్టీ నేతలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆలపాటి విజయానికి బ్రాహ్మణ సంఘ నాయకులు ప్రచారం



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ రాజాని ఈనెల 27వ తేదీ జరుగు ఎన్నికలలో నందిగామ నియోజకవర్గంలోని పట్టభద్రుల ఓటర్లందరూ తప్పనిసరిగా ఓటు వేసి వారిని అఖండ విజయంతో గెలిపించుకోవాలని, నందిగామ ఎమ్మెల్యే, విప్ తంగిరాల సౌమ్య, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బ్రహ్మశ్రీ వేమూరి ఆనంద్ సూర్య ల ఆదేశాలతో ప్రచారం ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన కోర్ కమిటీ సభ్యలు ప్రకాష్ నందిరాజు, రాష్ట్ర మహిళా కార్యదర్శి నందిరాజు కల్పన తెలిపారు. బిజెపి జిల్లా స్పోక్ పర్సన్, సీనియర్ బ్రాహ్మణ నాయకులు బండారు కేదారేశ్వర శర్మ,బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ కోఆర్డినేటర్ పెండ్యాల సుబ్బారావు,బిజెపి నాయకులు కొమరగిరి వాచస్పతి లు బ్యాలెట్ పేపర్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేరు, వారి ఫోటో ఎదురుగా గల గడిలో ఒకటవ నంబరు వేసి వారిని గెలిపించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి ఎస్ నందిగామ సోషల్ మీడియా చీఫ్ రాజ హనుమంతరావు నందిరాజు, లక్ష్మీనారాయణ, వల్లి, చింతా ప్రసాద్, వారణాసి రవి తదితరులు పాల్గొన్నారు.

## కురుమద్దాలిలో ఆలపాటికి మద్దతుగా ప్రచారం



**పామర్రు మేజర్ న్యూస్ :** ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓట్లు వేసి గెలిపించాలని తెలుగు దేశం నాయకులు పామర్రు మండలం కురుమద్దాలి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ఇంటింటికి తిరిగి పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. సీనియర్ నాయకుడైన ఆలపాటిని పెద్దల సభకు పంపడం ద్వారా పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని ఈ సందర్భంగా కొసరాజు వెంకటేశ్వరరావు అభ్యర్థులకు సూచించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి ఎన్నికల విజయం చారిత్రాత్మక అవసరం

### గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కోట వీరబాబు




**హనుమాన్ జంక్షన్, మేజర్ న్యూస్ :** ఈ నెల 27వ తేదీన జరుగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు అన్నారు. గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సూచనల మేరకు మంగళవారం మధ్యాహ్నం విజయవాడ రోడ్డులోని ఆళ్ళ వెంకట గోపాల కృ ష్ణారావు ఆవరణలో బాపులపాడు మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు అధ్యక్షతన మండలంలోని 126, 127, 128 బూత్లకు సంబంధించి 27 గ్రామాలనుంచి వచ్చిన టీడీపీ నాయకులు, పోలింగ్ బూత్ ఇన్చార్జ్ లతో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో రాష్ట్ర టీడీపీ నాయ కులు గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, మూల్పూరి సాయికళ్యాణి, వేగిరెడ్డి పాపారావు, జిల్లా టీడీపీ నాయకులు యనమదల వెంకయ్యారావు, వడ్డెల్లి లక్ష్మికుమారి, మండల టీడీపీ నాయకులు పుట్టా సురేష్, కలపాల కుమార్, చలసాని శ్రీనివాసరావు, అట్లూరి శ్రీనివాసరావు, మజ్జిగ నాగరాజు, మందాడి రవీంద్ర, తుమ్మల బ్రహ్మాజి, మాదాల శ్రీనివాసరావు, కాటూరి విజయ భాస్కర్, కొమ్మారెడ్డి రాజేష్, చింతల అప్పారావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, ఆర్నేపల్లి సూరిబాబు, గండేపూడి నితీష్ కుమార్, భీమినేని పాండురంగారావు, మొవ్వా వేణుగోపాల్, కలపాల రాధాకృష్ణ పాల్గొన్నారు.

## ఆలపాటి గెలుపు పెద్దల సభకు పెద్దరికం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటును 1 అంకె వేసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను పెద్దల సభకు పంపాలని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్త బండి రామకృష్ణ చిలకలపూడి పాండు రంగ హై స్కూల్, లక్ష్మణరావు పురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సమావేశంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిలకలపూడి పాండురంగ హై స్కూల్, లక్ష్మణరావు పురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, జనసేన పార్టీ నాయకులు గడ్డంరాజు, కొట్టేవెంకట్రావు,కర్రి మహేశ్,ఎస్ ఎస్ మిల్క్ పాల సురేష్, అనుపోజునూతన్ శాయనశివయ్య,మంత్రి పృధ్వి, తదితరులు పాల్గొన్నారు.

## ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించండి

### పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి జనసేన, బీజేపీ బలపర్చిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎన్ఆర్ఐ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ కోరారు. గురువారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు ఓటు వేయటం ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జోడెడ్లుగా పరుగులు తీయిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి మద్దతునిచ్చినట్లువుతుందని ఆయన తెలిపారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం విక్కుర్తి ముమ్మర ప్రచారం.



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి పార్టీలు బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం పారిశ్రామికవేత్త, కూటమి పార్టీ నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం నియోజకవర్గంలోని మోపిదేవి, చల్లపల్లి మండలాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులను, పట్టభద్రు లను కలిసి విస్తృతంగా ప్రచార నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించవలసినదిగా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు, బర్మా శ్రీనివాసరావు, రేపల్లె ఈశ్వర రావు, రేపల్లె ప్రతాప్,బర్మా బుజ్జి, భూపతి నాంచరయ్య, రేపల్లె ముసలయ్య,ఎస్ పున్నయ్య చౌదరిలతో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## అలపాటి విజయంతో ప్రభంజనాన్ని చూపిద్దాం



**గుడివాడ, మేజర్ న్యూస్ :** కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ను అత్యధిక మెజార్టీతో గెలిపించి విజయం సాధించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏలూరు రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో (ప్రజా వేదిక)లో విశ్రాంత, ప్రభుత్వ ఉద్యోగులు, కూటమి శ్రేణులతో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలు నుకాలమ్మ, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్లతో కలసి ఎమ్మెల్యే రాము మాట్లాడారు. ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దీంట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, నందివాడ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు పాల్గొన్నారు.

# పులిగడ్డ సర్పంచ్ విజయను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మదర్ తెరిసా విశిష్ట సేవా పురస్కారం అందుకున్న పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ను మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఘనంగా సత్కరించారు. గత సంవత్సరం వచ్చిన వరదలు కోవిడ్ సమయంలో విజయ్ కుమార్ ప్రజలకు విశిష్ట సేవలు అందించినందుకు హైదరాబాదుకు చెందిన విశ్వ ఆర్ట్ నిర్వాహకులు ఈ సేవా పురస్కారాన్ని ఈనెల 16వ తేదీన హైదరాబాదులో విజయ్ కుమార్ కు అందజేశారు. మంగళవారం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు విజయ్ కుమార్ ను దృశ్యాలువా పూలమాల మెమెంటో తో ఘనంగా సత్కరించారు సేవా కార్యక్రమాలకు ఇటువంటి పురస్కారాలు మరింత స్ఫూర్తిని ఇస్తాయన్నారు. భవిష్యత్తులో ఇటువంటి పురస్కారాలు మరెన్నో అందుకోవాలని సర్పంచ్ విజయ్ కుమార్ ను అభినందించారు. సర్పంచ్ విజయకుమార్ మాట్లాడుతూ ఈ సేవ పురస్కారం వలన తనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ పురస్కారాన్ని అందించిన నిర్వాహకులు ఆకుమల్ల నాని రంజిత్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, జెడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, అవనిగడ్డ,మోపిదేవి మండలాల పార్టీ కన్వీనర్లు రేపల్లె శ్రీనివాసరావు, గరికిపాటి బుల్లి, మాజీ సర్పంచ్ నలకుర్తి పృథ్వీరాజ్ వైఎస్ఆర్సిపి నాయకులు రాజనాల మాణిక్యాలరావు, చింతలపూడి బాలు, గాజుల జై గోపాల్ చిట్టూరి రమేష్ గార్లపాడు గోపి రామకృష్ణ లతోపాటు పలువురు నాయకులు పాల్గొని దాసరి విజయను అభినందించారు.



## బూత్ ఏజెంట్ల సమావేశం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** బూత్ ఏజెంట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కోరారు. మంగళవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, పట్టాభిరా మ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలింగ్ రోజు బూత్ ఏజెంట్ల బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. ఒక్క ఓటు కూడా మురిగిపోకుండా పోలింగ్ ఎన్నికల నిబంధనల ప్రకారం జరిగేలా శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ యువనాయకులు వెంకట్రామ్, కూటమి నాయకులు, ఆరుమండలాల పోలింగ్ బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## కెఎస్ లక్ష్మణరావుని గెలిపించాలి

### మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఈనెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న కే ఎస్ లక్ష్మణ్ రావుకు వైఎస్ఆర్ సిపి శ్రేణులు మేధావులు పట్టబద్రులు మద్దతు ఇవ్వాలని మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు కోరారు. మంగళవారం నియోజకవర్గ వైఎస్ఆర్ సిపి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల తరఫున ఎన్నో పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యలను పెద్దల సభలో లేవనెత్తుతూ ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశారు అన్నారు ఆలపాటి రాజేంద్రప్రసాద్ సీఎం చంద్రబాబు ఏది చెబితే అలా వినే మనిషి అన్నారు ప్రజల గొంతుకను వినిపించేటందుకు పెద్దల సభలో ప్రశ్నించాలంటే ఆయన వల్ల కాదని అందుకే కె ఎస్ లక్ష్మీనారాయణ కు ఓటు వేసి గెలిపిస్తే అందరికీ మంచి జరుగుతుంది అన్నారు మేధావులు ఉపాధ్యాయులు పట్టభద్రులు కేఎస్ లక్ష్మణ్ రావు మొదట ప్రధానిత ఓటు వేసి గెలిపించాలని రమేష్ బాబు కోరారు. ఈ సమావేశంలో అవనిగడ్డ పులిగడ్డ సర్పంచులు గౌర్రుముచ్చు ఉమా దాసరి విజయ్ కుమార్ మాజీ సర్పంచ్ నలకుర్తి పృథ్వీరాజ్ వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు వైఎస్ఆర్ సిపి మోపిదేవి మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) పార్టీ నేతలు చింతలపూడి బాలు గాజుల జై గోపాల్ పలువురు నేతలు పాల్గొన్నారు.

## నిజాయితీ నిబద్ధత గల కె.ఎస్. లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం



**జగ్గయ్యపేట రూరల్ మేజర్ న్యూస్:** ఉమ్మడి కృష్ణా -గుంటూరు జిల్లా ల గ్రాడ్యుయేట్స్ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ అనుమంచిపల్లి, రామచంద్రుని పేట గ్రామాలలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటర్లకు కరపత్రాలు పంచుతూ ఓటు వేయాలని కోరారు. మొదటి ప్రాధాన్యత ఓటు కేఎస్ లక్ష్మణ్ రావు 23 నెంబర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు 1 వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోటా రవికుమార్, దంతాల నరేంద్ర, వి వి రాంప్రసాద్, జె వెంకటరావు, కాకనబోయిన వెంకటేశ్వరరావు, కోట కృష్ణ దంతాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బేటి బచావో బేటి పడవో అవగాహన కార్యక్రమం



**వత్సవాయి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బేటి బచావో భేటీ పడవో' కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు బాల్య వివాహాలు, పోక్స్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి యం రాజేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా బాలల సంరక్షణ యూనిట్ 18 సంవత్సరాల లోపు బాల్య వివాహాల చట్టాల పై అవగాహన ఆయన కల్పించారు. అదేవిధంగా తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రభుత్వం నెలకు 4వేల రూపాయలు స్పాన్సర్షిప్ క్రింద ఆర్థికసాయం అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. తల్లిదండ్రులు అందరు బాల్య వివాహాలు జరగకుండా చూడాలి అని అన్నారు. అనంతరం ఎంపీడీఓ రాంబాబు మాట్లాడుతూ బాల్య వివాహాలు వలన ఆనారోగ్యం, మానసికమైన సమస్యలు వస్తాయని ఆయన అన్నారు. జిల్లా లీగల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ బాలికలు లైంగికంగా ఎదుర్కొంటున్న సమస్యలు గురించి ఆయన క్షుణంగా వివరించటం జరిగింది. మండల ఎమ్జిఎన్ఆర్ఈజిఎస్ అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాఘవ మాట్లాడుతూ ఇక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరూ అన్ని చట్టాలుపై అవగాహన కలిగి వాటిని అమలు చేయుటకు అందరూ సహకరిం చాలని ఆయన తెలిపారు. నిరుద్యోగులకు ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది అని అన్నారు. వాటిని వినియో గించుకోవాలని వారు పేర్కొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ పోక్సో చట్టం ఎలా ఉంటుంది దాని విధానాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ బీబీజాని, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## పోస్ట్మాన్ పోతురాజు వీరవసంతరావు పై సస్పెన్షన్ వేటు



**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** పోస్టల్ శాఖకు సరైన సమాచారం ఇవ్వకుండా మభ్యపెట్టిన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పోస్టల్ శాఖ బ్రాంచ్ పరిధిలో పనిచేస్తున్న పోస్ట్మాన్ పోతురాజు వీరవసంతరావు ను సస్పెండ్ చేయడం జరిగింది. పోస్ట్మాన్ గా పనిచేస్తున్న వసంతరావు పై ఎన్నికల నిబంధనలో అతిక్రమించారని, అలాగే తిరుమలగిరి గ్రామంలో పలు రకాల రాజకీయ ఘర్షణలు తదితర కేసులలో నిందితులుగా ఉండటంతో పోలీస్ శాఖ సస్పెక్టెడ్ షీట్ అనగా గ్రామంలో శాంతియుత వాతావరణన్ని భగ్నం చేసే అసాంఘిక శక్తిగా మారారని, పోస్టల్ శాఖ వారి ఉత్తర సమాచారాన్ని నేరుగా పంపిణీ చేయకుండా విధులను నిర్లక్ష్యం చేయటంపై కొన్ని రకాల ఫిర్యాదులు పోస్టల్ శాఖ వారికి అందిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలు ఫిర్యాదులపై పోస్టల్ శాఖ వారు విచారణ నిర్వహిస్తూ ఉన్నారు. ప్రాథమికంగా కొన్ని ఆరోపణలు నిర్ధారణ కావడంతో పోస్ట్మాన్ వసంతరావు సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను నందిగామ పోస్టల్ శాఖ ఇన్స్పెక్టర్ విష్ణు ద్వారా పోస్టులను వసంతరావుకు అందజేయడం జరిగింది.

## ముగిసిన ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవాలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో పెంచేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం 60 వసంతాలు మహోత్సవం సందర్భంగా గత మూడు రోజులుగా జరుగుతున్న స్వామి వారి పూజలు అభిషేకాలు యజ్ఞాలు హోమాలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. స్వామివారికి వేకువ జామున ఆలయ అర్చకులు జి పార్థసారథి, దీవి రఘునాథచార్యులు, వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు లక్ష నాగవల్లి పత్ర అర్చన హారతి మంత్రపుష్పం ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. గత మూడు రోజుల నుండి భక్తులు భారీగా తరలివచ్చి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం సామూహికంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త శిర్విశెట్టి వెంకట రాజేశ్వరరావు భక్తులకు కావలసిన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 4వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. సామాజిక సమన్వయకర్త బెస్ట్ సోషల్ వర్కర్ బచ్చు ఆదినారాయణలతోపాటు పలువురు వారి సేవలను అందజేశారు.

## ఎమ్మెల్యే మండలి ని ఆహ్వానించిన అమెరికా సదస్సు



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : అమెరికాలోని ఫిలడెల్ఫియాలో జరిగే మొదటి ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ నేషనల్ కన్వెన్షన్ కు ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ను ఆహ్వానించారు. 'ఏఏఏ' న్యూజెర్సీ ప్రెసిడెంట్, నేషనల్ కన్వెన్షన్ కన్వీనర్ – యూఎస్ఏ సత్య వెజ్జు అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఉదయం బుద్ధప్రసాద్ ను కలిసి ఆహ్వాన పత్రిక అందచేశారు. మార్చి 28, 29 తేదీల్లో జరిగే మొదటి నేషనల్ కన్వెన్షనుకు విచ్చేయాలని కోరారు. అమెరికాలో ఆంధ్రుల కోసం కులమతాలకు అతీతంగా ఫౌండర్ హరి మోటుపల్లి, నేషనల్ ప్రెసిడెంట్ బాలాజీ వీర్నాల స్థాపించిన 'ఏఏఏ' సంస్థ 18 నెలల్లోనే అమెరికాలోని 15 రాష్ట్రాల్లో విస్తరించి, 15వేలకు పైగా సభ్యత్వాలు నమోదు అయినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఈ మొదటి సభకు దాదాపు ఇరవై వేల మంది తెలుగు వారు విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వాతిశ్రీ, అవనిగడ్డ ప్రముఖులు బొప్పన లక్ష్మీనారాయణ ప్రసాద్, శ్రీరామ్ డిజిటల్ నెట్వర్క్ నిర్వాహకులు బొప్పన శ్రీరామ్ పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు జన్మదిన వేడుకలు





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు వైయస్సార్ సిపి మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అవనిగడ్డలోని చంద్రశేఖర రావు ఇంటి వద్ద వైయస్సార్ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పలువురు నాయకులు అభిమానులు కేక్ కట్ చేసి అభిమానులకు పంచి డాక్టర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాదులోని చంద్రశేఖర రావు నివాసంలో సింహాద్రి చంద్రశేఖర రావు వైద్యులు వైసిపి నేతలతో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు రొట్టెలు పండ్లు సింహాద్రి వెంకటేశ్వరరావు డాక్టర్ శ్రావణి లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నలకుర్తి పృథ్విరాజ్ రాధా రంగా మిత్రమండలి దివి యూనిట్ అధ్యక్షులు వైసీపీ నాయకులు రాజనాల మాణిక్యాలరావు, సింహాద్రి లంకేశ్వరావు, కమ్మిలి శ్రీరామమూర్తి గరిగిపాటి కృష్ణారావు కమ్మిలి రాజా సింహాద్రి సాయి ప్రవీణ్ లతో పాటు పలువురు వైసీపీ నేతలు వైద్యులు పాల్గొన్నారు.

# విభజన కంటే జగన్ పాలనలోనే రాష్ట్రానికి అధిక నష్టం

## జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ గద్దె అనురాధ





**కృష్ణలంక మేజర్ న్యూస్ :** రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఆంధ్ర రాష్ట్రానికి నష్టం జరిగిందని అప్పటికంటే కూడా 2019-24 మధ్య జగన్ విధ్వంసపాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టమే ఎక్కువని జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కృష్ణలంక 21వ డివిజన్ పరిధిలోని కృష్ణ చైతన్య స్కూల్లో ఉపాధ్యాయులను కలిసి ఆలపాటి రాజాకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గద్దె అనురాధ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలంతా చక్కటి తీర్పుతో రాష్ట్రంలో మంచి ప్రభుత్వంను ఎన్నుకున్నారని దానికి కొనసాగింపుగా ఆలపాటి రాజాను మంచి మెజార్టీతో గెలిపించాలన్నారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు ఆలపాటి రాజా కృషి చేస్తారన్నారు.

# నిర్మాణ వ్యర్థాల తొలగింపుకు ట్రాక్టర్ యజమానులతో అవగాహన ఒప్పందం





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నిర్మాణ వ్యర్థాలు సర్కిల్ పరిధిలో ఎప్పటికప్పుడు తొలగాలన్న విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, ప్రైవేట్ ట్రాక్టర్ యజమానులతో నిర్మాణ వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించే విధంగా అవగాహన ఒప్పందం (యంవోయు) కొరకు మంగళవారం ఉదయం తమ తమ సర్కిల్ కార్యాలయాల్లో సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోగల పబ్లిక్ వీధుల్లో నిలువ ఉన్న భవన నిర్మాణ వ్యర్థ పదార్థాలను తొలగించుటకు గాను రవాణా ట్రాక్టర్ యజమానులకు నగరపాలక సంస్థ మధ్య అవగాహన ఒప్పందం ద్వారా సర్కిల్ పరిధిలో గల అన్ని వీధుల యందు ఉన్న భవన నిర్మాణ వ్యర్థ పదార్థాలను నగర పాలక సంస్థ సిబ్బంది వారి సమాచారం మేరకు వాటిని తొలగించుటకు వారి సమక్షంలో భవన యజమానులతో తొలగింపునకు సహితుకమైన చార్జ్ వసూలు పై ట్రాక్టర్ ద్వారా తొలగించవలెనని ఈ సమావేశంలో చర్చించారు. ఈ అవగాహన ఒప్పందంలో ఉన్న షరతుల ప్రకారం ఉదయం 6 గంటల నుండి ట్రాక్టర్ కార్మికులతో సహా వాహనము అందుబాటులో ఉండాలని డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్రైవర్లు మాత్రమే ట్రాక్టర్‌తో అనుమతించవలెనని, తొలగించిన వ్యర్థాలను నిర్దేశించిన ప్రాంతము లో కాకుండా కాలువలో కానీ శివారు ప్రాంతపు రోడ్డు లో కానీ వెయ్యరాదని, ఒకవేళ వేస్తే ఐదు వేల రూపాయలు జరినామా విధించబడనని, నోడల్ ఆఫీసర్ తెలియజేసిన 24 గంటల్లో సిఎన్డి వేస్టుని తొలగించాలని, మొదలగు విషయాలపై షరతులు ఉన్నాయి. ఈ సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్ర బోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, రవాణా ట్రాక్టర్ల యజమానులు పాల్గొన్నారు.



## డివిజన్లోని 7మండలాల్లో 18 వేల 440 మంది పట్టభద్రుల ఓటర్లు

### ఆర్డీవో బాలసుబ్రమణ్యం

**గుడివాడ, మేజర్ న్యూస్ :** కృష్ణ – గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు గుడివాడ డివిజన్ లో పూర్తయినట్లు ఆర్డిఓ జి. బాలసుబ్రమణ్యం తెలియజేశారు. గుడివాడ ఆర్డీవో కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని తెలియచేశారు. గుడివాడ డివిజన్ పరిధిలో ఏడు మండలాల్లో 18 వేల 440 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు ఆర్డిఓ వివరించారు. మండల కేంద్రాల్లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డిఓ బాలసుబ్రమణ్యం సూచించారు. పట్టభద్రులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటుగా ప్రతి కేంద్రంలో మెడికల్ క్యాంపు, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని ఆర్డిఓ తెలియజేశారు.

# పొడి, తడి చెత్తను వేరు వేరుగా అందించండి





## రహదారులు, మురుగు కాల్వలలో చెత్తను వేయకండి....

## పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దండి

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మొవ్వ మేజర్ న్యూస్ :** స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులతో పాటు ప్రతీ ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం లో భాగంగా మంగళవారం ఉదయం మొవ్వ మండలం నిడు మోలు గ్రామంలో శానిటేషన్ పనులను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొడి,తడి చెత్తలను వేరు చేయాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో నివశిస్తున్న ప్రజలు గృహాలలో వినియోగించే వస్తులలో పనికిరాని చెత్త తీసివేసినపుడు తడి, పొడి, హానికరమైన చెత్తలను వేరు చేసి సంబంధిత డస్ట్బిన్ లలో వేసి శానిటరీ సిబ్బంది ఇంటింటికి వచ్చినపుడు అందజేయాలని కోరారు. తడి, పొడి చెత్తలను వేరు చేస్తేనే ప్రాసెసింగ్ ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో తడి చెత్త నుండి వర్మీ కంపోస్టు తయారు చేయడం జరుగుతుందని, పొడి చెత్తను రీ సైక్లింగ్ కు పంపిస్తామని చెప్పారు. హాని కరమైన చెత్త అనగా డైపర్స్, శానిటరీ నాఫ్కిన్స్, మెడిసిన్స్, గాజు వస్తువులు హానికరమైనవని తెలిపారు. హానికరమైన చెత్తను రెడ్ కలర్ డస్ట్బిన్‌లో వేయాలని కోరారు. కార్పొరేషన్‌లో ఉండే ప్రాసెసింగ్ ప్లాంట్స్, గ్రామాల్లో ఉన్న సోలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్ డబ్ల్యూ పిసి)వద్ద చెత్తను వేరుచేసి ఎరువులు తయారు చేస్తారని పేర్కొన్నారు. ప్రతీ ఇంటిలో సాధ్యమైనంత వరకు వారి పెరటిలోనే తడి చెత్తతో హోం కంపోస్టు చేసుకోవాలని చెప్పారు. ఇప్పటికే మచిలీపట్నం నగరపాలక సంస్థ, కొన్ని పురపాలక సంఘాలలో ఈ ప్రాసెస్ జరుగుతోందని, ప్రజలు మరింత అవగాహన పెంచుకొని ఈ కార్యక్రమం లక్ష్యాన్ని చేరుకుందామన్నారు. ఉపాధి హామీ నుండి హోం కంపోస్టులు, కమ్యూనిటీ కంపోస్టు పిట్స్ కట్టడం శానిటేషన్లో ఒక భాగమని తెలిపారు. అధికారులతో పాటు ప్రజలు శానిటేషన్ వైపు అడుగు ముందుకు వేస్తే పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలు జిల్లాగా తయారు చేసుకోవచ్చున్నారు. భవిష్యత్ తరానికి కలుషితం లేని వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ డీకే బాలాజీ కోరారు.



## అభివృద్ధికి పట్టం కట్టండి

### ఆలపాటి రాజును గెలపించాలని రవి నాయుడు, గద్దె క్రాంతి ప్రచారం



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఈనెల 27వ తేదిన జరగబోయే పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపాడు. మంగళవారం ఉదయం లయోలా కాలేజీలోని వాకర్స్‌ను శాప్ రవి నాయుడు, గద్దె క్రాంతి కుమారులు ఓట్ల అభ్యర్థించారు. ఎన్డీయే అభ్యర్థిగా ఆలపాటి రాజా పోటీ చేస్తున్నారని, మొదటి ప్రాధాన్యత ఓటుగా సూచించి, అత్యధిక మెజారిటీతో గెలిపించి అభివృదికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

## ఈవీఎం గోదాముకు పటిష్ట భద్రత..





### పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ రూరల్, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని.. పోలీసు సిబ్బంది 24X7 అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు తదితరాలను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్ గోదామును ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు వెల్లడించారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. తనిఖీ ప్రక్రియలో కలెక్టర్ వెంట డీఆర్‌వో ఎం. లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999